## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



నిరంతర వార్తా ప్రవాహం

RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:320 | సోమవారం జూన్ 22, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00




## శ్రీలంక Aపై విజయం..

### ముక్కోణపు సిరీస్ విజేతగా భారత్ A

దంబుల్లా: శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఇండియా ఎ విజేతగా నిలిచింది. శ్రీలంక ఎతో జరిగిన ఫైనల్‌లో భారత్ ఎ 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 377 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన లంక.. 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. వనుజ సహన్ (62), సదీర సమరవిక్రమ (52) అర్ధ శతకాలు చేయగా.. విజయకాంత్ వియాస్కాంత్ (39), సహన్ అరచ్చిగే (38), నిరోషన్ డిక్వెల్లా (25) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు తక్కువ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో యశ్ ఠాకూర్ 3, విప్రాజ్ నిగమ్ 3, అనుకుల్ రాయ్ 2, అశోక్ శర్మ, తిలక్ వర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.

తొలుత భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. తిలక్ వర్మ (67), రుతురాజ్ గైక్వాడ్ (40), ప్రియాంశ్ ఆర్య (39), అనుకుల్ రాయ్ (39), కుమార్ కుశాగ్ర (36), విప్రాజ్ నిగమ్ (27) పరుగులు చేశారు.

ఇండియా ఎ తో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో శ్రీలంక ఎ ఆరు వికెట్లు కోల్పోయింది. తొలి ముగ్గురు బ్యాటర్లు అవిష్క ఫెర్నాండో (3), నిరోషన్ డిక్వెల్లా (25), నువనిదు ఫెర్నాండో (21)ని యశ్ ఠాకూర్ ఔట్ చేశాడు. నాలుగో స్థానంలో వచ్చిన సదీర సమరవిక్రమ (52; 44 బంతుల్లో) అర్ధ శతకం చేసి వెనుదిరిగాడు. ఇతడిని అశోక్ శర్మ వెనక్కి పంపాడు.

పేజి 2లో ▶

# నీట్ పరీక్ష..

## ప్రయాణం వాయిదా వేసుకున్న ప్రధాని మోదీ



- పరీక్ష ప్రారంభమైన మధ్యాహ్నం 2 గంటల తర్వాత అధికారిక నివాసానికి బయలుదేరారు.
- దేశవ్యాప్తంగా 22 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్షకు హాజరు.
- భారత్‌లో 5,440, విదేశాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు.
- 1.38 లక్షల సీసీటీవీ కెమెరాలు, 95 వేలకుపైగా పరీక్షా గదులపై నిఘా.
- ఎలక్ట్రానిక్ మోసాల నివారణకు 51 వేలకుపైగా సిగ్నల్ జామర్లు వినియోగం.
- ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ఏఐ ఆధారిత పర్యవేక్షణతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు.

దేశవ్యాప్తంగా నీట్ రీటెస్టు జరుగుతోంది. దీనికోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ సైతం సమయానుకూల నిర్ణయం తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటన అనంతరం మధ్యాహ్నం దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. అధికారిక నివాసానికి వెళ్లేందుకు తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్ష కోసం ఎగ్జామ్ సెంటర్లకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

నీట్ రీటెస్టు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. అయితే, ప్రధాని మోదీ మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన వెంటనే అక్కడి నుంచి అధికారిక నివాసానికి బయల్దేరాలి. కానీ.. తన ప్రయాణాన్ని కాసేపు వాయిదా వేసుకున్నారు. నీట్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు దేశ రాజధానిలో ట్రాఫిక్ సజావుగా సాగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పేజి 2లో ▶

## అయోధ్యను వీడి వెళ్లొద్దు'..

### ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

- అయోధ్య రామాలయంపై సిట్ దర్యాప్తు ముమ్మరం
- ట్రస్ట్, ఆలయ సిబ్బందికి అయోధ్య వీడొద్దని ఆదేశాలు
- విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ
- భూ కొనుగోళ్లు, నిర్మాణ సామగ్రి సేకరణపై దృష్టి
- మార్కెట్ ధర కంటే ఎక్కువకు భూముల కొనుగోలు ఆరోపణలు
- సీసీటీవీ ఫుటేజీలను సిట్ పరిశీలన
- ఫుటేజీ తారుమారు చేసిన ఆనవాళ్లు గుర్తింపు
- డిలీట్ చేసిన డేటా రికవరీకి ప్రయత్నాలు



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి.

రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు భూములను ట్రస్ట్ కొనుగోలు చేసిందనే ఆరోపణల నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, భద్రత నిర్వహణను సిట్ బృందం ఇప్పటికే పరిశీలించింది.

పేజి 2లో ▶

## ఒలింపిక్సే లక్ష్యంగా తెలంగాణలో

# 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'

- తెలంగాణలో త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడా విధానం
- గ్రామీణ ప్రతిభకు ప్రపంచ స్థాయి శిక్షణ
- టీజీ-20 క్రికెట్ లీగ్ ప్రారంభం
- ప్రతి జిల్లా నుంచి క్రీడాకారులకు అవకాశం
- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు
- ఉప్పల్‌లో అంతర్జాతీయ ప్రమాణాల యూనివర్సిటీ
- ఒలింపిక్ స్థాయి శిక్షణకు ఏర్పాట్లు
- 21 రోజుల పాటు టీజీ-20 హంగామా
- టోర్నీకి పూర్తి సహకారం: భట్టి విక్రమార్క



హైదరాబాద్:
గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవకాశాలు లేక మరుగున పడిపోతున్న ప్రతిభాపాటవాలను వెలికితీసి, వారికి సరైన శిక్షణనిచ్చి ప్రపంచానికి పరిచయం చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో ఒలింపిక్స్ బరిలో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సరికొత్త 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'ని త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం" అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

ఉప్పల్ స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభమైన 'టీజీ 20 క్రికెట్ లీగ్' మెగా టోర్నమెంట్‌కు డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ లీగ్ ఒక బలమైన పునాది కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

"గతంలో క్రికెట్ అంటే కేవలం నగరాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ, ఆ పరిస్థితులను మారుస్తూ మొదటిసారిగా మా ప్రభుత్వం ప్రతి జిల్లా నుంచి క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించింది. జిల్లాల వారీగా జట్లను (టీమ్‌లను) ఎంపిక చేసి గ్రామీణ యువతకు ఈ మెగా వేదికను కల్పించాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలను పెద్దపీట వేస్తూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉంది" అని భట్టి విక్రమార్క తెలిపారు.

గతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫుట్‌బాల్ స్టార్ 'మెస్సి' ఆడిన ఈ ఉప్పల్ స్టేడియం సాక్షిగా.. హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి వసతులు, అన్ని హంగులతో కూడిన స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతోందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఒలింపిక్స్ స్థాయి శిక్షణ ఇచ్చేలా తెలంగాణలో ఒక బలమైన క్రీడా వ్యవస్థను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 21 రోజుల పాటు సాగనున్న ఈ 'టీజీ 20 క్రికెట్' హంగామా.. రాష్ట్రంలోని క్రీడాభిమానులకు ఒక పెద్ద పండుగ వాతావరణాన్ని తీసుకురానుంది. ఈ టోర్నీ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

### అట్టహాసంగా TG 20 లీగ్ ఓపెనింగ్ సెర్మనీ.. హాజరైన భట్టి, సిరాజ్, రౌడీ బాయ్ విజయ్



హైదరాబాద్:
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న TG 20 లీగ్ ఓపెనింగ్ సెర్మనీ అట్టహాసంగా జరిగింది. ఆదివారం (జూన్ 21) హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్, మాజీ క్రికెట్ అంబటి రాయుడు, బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ చాముండి, ఈ లీగ్ బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ హాజరయ్యారు.

## ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

- సోమవారం నుంచి యాక్షన్ టేకెన్ రిపోర్టులు
- మొత్తం 10 కీలక అంశాలపై నివేదికలు సిద్ధం
- నాలుగు ప్రోగ్రెస్ రిపోర్టులను విడుదల చేయనున్న సీఎం
- విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం



2లో..

# ఉద్యాన శాఖ అంటే ఏంటి...? వ్యవసాయ శాఖ అంటే ఏంటి..?

- క్లుప్తంగా వివరించండి... "కింజరపు అచ్చెన్నాయుడు" సారు..!!
- రాష్ట్రంలో ఉద్యాన శాఖ ఉందా..? లేదా..? ఉంటే ఏ శాఖ వారు ఏ శాఖలో పని చేస్తున్నారు చెప్పండి అయ్యా..!!
- అంతా అయిపోయాక ఇప్పుడు ఎందుకు ఎవరిని మభ్య పెట్టాలని... తోతాపురికి నాలుగు రూపాయలు సబ్సిడీ...!?
- యూరియా మింద ఉన్న ఏకాగ్రత పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇప్పించాలని లేదా...!!?

### వెటర్నరీ శాఖ అంటే ఏంటి..?



- రాష్ట్రంలో ఉద్యాన శాఖ అసలు ఉందా...? ఉంటే తోతా పూరి మామిడి కాయలు కోతలు మొదలై సుమారు 40 రోజులు దాటుతోంది రైతులు రోడ్డెక్కి ప్రజాప్రతినిధుల్ని నిలదీస్తేనే గిట్టుబాటు ధర కల్పిస్తారా లేకుంటే పట్టించుకోరా...??

# సంపాదకీయం

## ప్రాంతీయ పార్టీలకు మరణశాసనమేనా ?

..దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో లోక్‌సభ సీట్లను 50శాతం పెంచడంతోపాటు చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అవసరమైన మద్దతు కూడగట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. రాజకీయంగా మోదీ-షాలకు ఇది తొలి ఎదురు దెబ్బ. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ ప్రాంతీయ పార్టీలు' ప్రారంభమైంది...నేటి బాధిత పక్షాలే ఒకనాడు ఫిరాయింపులను ప్రోత్సహించిన విషయం మరువకూడదు. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలను మింగేయాలని చూశారు. ఆయన మరణంతో అది ఆగిపోయింది.తిలా పాపం తలా పిడికెడు అన్నట్టుగా ఫిరాయింపులను ప్రోత్సహించిన పాపంలో అన్ని పార్టీలకూ అంతో ఇంతో వాటా ఉంది. ఈ కారణంగా ఇప్పుడు బీజేపీ చేస్తున్నది మహాపరాధం అని చెప్పలేని పరిస్థితి!..బీజేపీ పోకడలు సమ్మతం కాని పక్షంలో ప్రజలే సరిదిద్దే బాధ్యత తీసుకుంటారు. అది ఎప్పుడు? అంటే సమయం వచ్చినప్పుడు అని చెప్పుకోవాలి...ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా పనిచేసిన ఎంఏ షరీఫ్, ప్రస్తుత చైర్మన్ మోషేన్ రాజునే తీసుకుందాం. ఈ ఇరువురికీ తమ పార్టీల పట్ల నిబద్ధత ఉండటం వల్లనే తమ అధినాయకులు అధికారం కోల్పోయినా, ఎవరెంతగా ప్రలోభపెట్టినా పార్టీ పట్ల విధేయతను వదులుకోవడానికి అంగీకరించ లేదు.ఈ దేశంలోని ప్రాంతీయ పార్టీలకు మరణ శాసనం లిఖించబడుతోందా? ముంచుకొస్తున్న ముప్పు నుంచి ప్రాంతీయ పార్టీలు తమను తాము కాపాడుకునే మార్గాలు మిగిలి ఉన్నాయా? భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఈ రాజసూయ యాగంలో ప్రాంతీయ పార్టీలు సమిధలుగా మిగిలిపోవలసిందేనా? 'కోర్ కోర్ శరణ్ కోర్' అన్న హుంకరింపులను ఔదలదాల్చినా వాటి మనుగడకు మాత్రమే గ్యారంటీ ఉంటుందా? ఎన్డీయే కూటమిలో భాగస్వాములుగా మారిపోయినంత మాత్రాన రక్షణ ఉంటుందా? దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలలో చీలికలు రావడానికి స్వయంకృతాపరాధమే కారణమా? లేక మోదీ--షాల మంత్రాంగం కారణమా? గడచిన కొన్ని రోజులుగా ప్రాంతీయ పార్టీలలో చోటుచేసుకుంటున్న చీలికల నేపథ్యంలో ఈ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎన్నికలలో ఓడిపోయే పార్టీలకు మనుగడ లేకుండా పోవడం వాంఛనీయమా? ఆయా పార్టీల తరఫున గెలిచిన చట్టసభల సభ్యులు ఇంత నిస్సిగ్గుగా పార్టీ మారడానికి ఎందుకు తెగబడుతున్నారు? రాజకీయాలు ఇంతలా ఎందుకు దిగజారుతున్నాయి? ఇటువంటి ప్రశ్నలకు కూడా సమాధానం లభించాల్సి ఉంది. రాజకీయ పార్టీలను చీల్చడం, ఫిరాయింపులను ప్రోత్సహించడం ఇప్పుడే ప్రారంభం కాలేదు. ఈ కారణంగా జరుగుతున్న పరిణామాలకు బీజేపీని మాత్రమే దోషిగా పేర్కొనలేము. దేశంలో కాంగ్రెస్ పాలన అప్రతిహతంగా కొనసాగినప్పుడు ఆ పార్టీ కూడా ఫిరాయింపులను ప్రోత్సహించింది. అప్పట్లో ఆయారాం గయారాం సంస్కృతిపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. దాదాపుగా అన్ని ప్రతిపక్ష పార్టీలు ఫిరాయింపులు, చీలికలకు బాధితులుగా మారాయి. దీంతో బుద్ధి తెచ్చుకున్న రాజకీయ పార్టీలు... ఫిరాయింపుల నిరోధక చట్టానికి పురుడుపోశాయి. అయితే, ఈ చట్టంలో ఎన్నో లొసుగులు! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్టుగా ఫిరాయింపుల నిరోధక చట్టానికి తూట్లు పొడిచారు. మూడింట రెండొంతుల నిబంధనను అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా మలచుకున్నారు. తాజాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న తిరుగుబాటు, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీకి చెందిన తొమ్మిది మంది ఎంపీలలో ఆరుగురు తిరుగుబాటు చేయడం రాజకీయ పరిశీలకులను విస్తుపోయేలా చేస్తోంది. ఈ దేశంలో ప్రాంతీయ పార్టీలను బతకనీయరా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు.నిజమే, ప్రధాని మోదీకి ప్రాంతీయ పార్టీల పట్ల విముఖత ఉందన్న ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. అయితే, ఉన్నట్టుండి ప్రాంతీయ పార్టీల అస్తిత్వంపై ఇప్పుడే కత్తి ఝుళిపించడం వెనుక కారణం ఏమిటి? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో లోక్‌సభ సీట్లను 50శాతం పెంచడంతోపాటు చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు అవసరమైన మద్దతును కూడగట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. రాజకీయంగా మోదీ--షాలకు ఇది తొలి ఎదురు దెబ్బ. బహుశా ఈ కారణంగా సదరు బిల్లులకు అవసరమైన మద్దతును సొంతంగా సమీకరించుకోవాలని వారిరువురూ నిర్ణయించుకొని ఉంటారు. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ ప్రాంతీయ పార్టీలు' ప్రారంభమైంది. ఒకదాని తర్వాత ఒకటిగా ప్రాంతీయ పార్టీలలో చీలికలు మొదలయ్యాయి.

**అందరూ ఆ తాను ముక్కలే...**

ఫిరాయింపులను ప్రోత్సహించడం సమర్థనీయమా? అంటే కానే కాదు! అయితే ఈ నేరానికి పాల్పడని ప్రధాన రాజకీయ పార్టీ ఏది? అంటే చెప్పలేని పరిస్థితి. అందుకే కాబోలు ప్రజలు కూడా ఇలాంటి ఫిరాయింపులను సీరియస్‌గా తీసుకోవడం లేదు. అంతమాత్రాన కేంద్రంలోని పెద్దలు చేపట్టిన చర్యలను తప్పు పట్టకుండా ఉండలేము. అయితే, నేటి బాధిత పక్షాలు ఒకనాడు ఇవే ఫిరాయింపులను ప్రోత్సహించిన విషయం మరువకూడదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుందాం. ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలను మింగేయాలని చూశారు. ఆయన మరణంతో అది ఆగిపోయింది. అంతకుముందు పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు లోక్‌సభలో అవసరమైన మెజారిటీ కొరవడటంతో ఫిరాయింపులను ప్రోత్సహించారు. తెలుగుదేశం ఎంపీలు కూడా ఫిరాయించేలా చేశారు. యూపీఏ ప్రభుత్వం తొలి టర్మ్‌లో కూడా తెలుగుదేశం ఎంపీలు పార్టీ ఫిరాయించేలా రాజశేఖర రెడ్డి మంత్రాంగం నడిపారు. ఈ కారణంగానే కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఆయనకు పట్టు పెరిగింది. రాష్ట్ర శాసనసభలో కూడా అప్పటి టీఆర్ఎస్ సభ్యులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీనిపై కేసీఆర్ అప్పట్లో తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి నాడు టీడీపీ, టీఆర్ఎస్ బాధిత పక్షాలుగా మిగిలాయి. విచిత్రం ఏమిటంటే, ఈ రెండు పార్టీలూ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ఫిరాయింపులకు దూరంగా ఉండలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక బీజేపీ మినహా మిగతా పార్టీల శాసన సభ్యులను కబళించారు. శాసనసభలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు టీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించారు. రాజ్యసభలో కూడా 2019 తర్వాత తెలుగుదేశం పార్టీ సభ్యులు బీజేపీలో విలీనం అయినట్టు ప్రకటించారు.

ఇలా ప్రకటించడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పరిహసించడం కాదా? రాజశేఖరరెడ్డి హయాంలో ఫిరాయింపుల విషయంలో బాధితులుగా ఉన్న కేసీఆర్, చంద్రబాబు 2014 తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహించలేదా? అదే కేసీఆర్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ తమ సభ్యులను చేర్చుకోవడంపై సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాటం చేస్తున్నారు. 2019కి ముందు తమ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విమర్శలు సంధించిన జగన్మోహన్‌రెడ్డి కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించారు. దేశంలోని మిగతా రాష్ట్రాలలో కూడా ఇంచుమించుగా ఇదే పరిస్థితి! తిలా పాపం తలా పిడికెడు అన్నట్టుగా ఫిరాయింపులను ప్రోత్సహించిన పాపంలో అన్ని పార్టీలకూ అంతో ఇంతో వాటా ఉంది. ఈ కారణంగా ఇప్పుడు బీజేపీ చేస్తున్నది మహాపరాధం అని చెప్పలేని పరిస్థితి!

**ఒక్కో పార్టీది ఒక్కో కథ...**

ఇప్పుడు దేశ రాజకీయాలలో మోదీ హవా నడుస్తోంది. ఆయనకేమో ప్రాంతీయ పార్టీలంటే గిట్టదు. ఈ నేపథ్యంలో ప్రాంతీయ పార్టీలు తమను తాము కాపాడుకోవడానికి ఏం చేయాలి? ఉన్నపళంగా తమ పార్టీల పరిస్థితి తలకిందులుగా ఎందుకు మారుతోంది? అన్న విషయమై ఆయా పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. విచిత్రం ఏమిటంటే, బీజేపీతో జట్టు కట్టిన ప్రాంతీయ పార్టీలు కూడా క్రమంగా బలహీనపడటాన్ని చూస్తున్నాం. బిహార్‌లో జేడీయూనే ఇందుకు నిదర్శనం. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూతో ప్రారంభంలో బీజేపీ జట్టు కట్టింది. దశాబ్దం తిరిగేసరికి బీజేపీ ప్రధాన పార్టీగా ఎదిగింది. జేడీయూ బలహీనపడింది. నితీశ్ కుమార్ కూడా ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకొని బీజేపీ నేత సామ్రాట్ చౌదరికి పీఠం కట్టబెట్టారు. ఇదిలా ఉండగా, దేశాన్ని కాంగ్రెస్ పార్టీ పరిపాలిస్తున్న సమయంలోనే ఆ పార్టీ పోకడలను నిరసిస్తూ ప్రాంతీయ ప్రయోజనాల కోసం ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి.

# బసవతారకం ఆస్పత్రి రజతోత్సవాలు

**హైదరాబాద్, జూన్ 21 :**
క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రారంభమైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ప్రపంచ స్థాయి క్యాన్సర్ వైద్య సేవలను తక్కువ ఖర్చుతో అందించాలన్న లక్ష్యంతో దివంగత నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో 1988లో ఈ కార్యక్రమానికి అంకురార్పణ జరిగింది. 2000 సంవత్సరంలో 100 పడకలతో ప్రారంభమైన ఈ ఆస్పత్రి, ప్రస్తుతం 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే ప్రముఖ సమగ్ర క్యాన్సర్ చికిత్స, పరిశోధనా కేంద్రంగా ఎదిగింది.

**పేదల ఆస్పత్రిగా గుర్తింపు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ప్రతి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లు, సుమారు 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు ఆస్పత్రి సేవలందిస్తోంది. క్యాన్సర్ చికిత్స కోసం ఆస్పత్రిని ఆశ్రయించే వారిలో 65 శాతం మందికిపైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ ఆరోగ్య పథకాల పరిధిలోని లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ బసవతారకం పేదల ఆస్పత్రిగా పేరు పొందింది.

**గ్రామాల్లో ముందస్తు స్క్రీనింగ్**

క్యాన్సర్ నివారణకు ముందస్తు గుర్తింపు లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలను ఆస్పత్రి నిర్వహిస్తోంది. డిజిటల్ మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ సదుపాయాలు కలిగిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ద్వారా వైద్య సేవలను గ్రామాలు, మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజల వద్దకే తీసుకెళ్తోంది. నందమూరి తారక రామారావు వారసుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఆస్పత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీగా బాధ్యతలు చేపట్టి ఈ ఆస్పత్రి నిర్వహణను ఒక పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు.

**నేడు రజతోత్సవ వేడుకలు**

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నిర్వహించనున్నారు. నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరు కానున్నారు.

# శ్రీలంక Aపై విజయం..

## ముక్కోణపు సిరీస్ విజేతగా భారత్ A

మొదటి పేజీ తరువాయి
విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌లో రవిందు ఫెర్నాండో (19).. తిలక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. సహన్ అరచ్చిగే (34)ని తిలక్ వర్మ వెనక్కి పంపాడు. 26 ఓవర్లకు శ్రీలంక స్కోరు 184/6. వనుజ సహన్ (16), విజయకాంత్ వియాస్కాంత్ (2) క్రీజులో ఉన్నారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఎ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగులు చేసింది.

# అయోధ్యను వీడి వెళ్లొద్దు'..

## ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి
అయితే, 45 రోజుల ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉండటం సవాల్‌గా మారింది. సీసీటీవీ ఫుటేజీలను తారుమారు చేశారనే ఆధారాలను కూడా అధికారులు గుర్తించారని.. డిలీట్ చేసిన, మార్చిన డేటాను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి.
ఒకే రోజు మూడు యుద్ధనౌకలు.. భారత సముద్రశక్తికి చిహ్నం..!
అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ఆలయ సిబ్బంది తదితరులను దర్యాప్తు అధికారులు ఇటీవల ప్రశ్నించారు. విరాళాల మొత్తాలను గురించి, ఆలయంలో వాటి నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

# ఉద్యాన శాఖ అంటే ఏంటి...?

# వ్యవసాయ శాఖ అంటే ఏంటి..?

**తిరుపతి జిల్లా ఇన్చార్జ్ న్యూస్ జూన్ 21 జన సముద్రం న్యూస్**

మొదటి పేజీ తరువాయి
తిరుపతి జిల్లా మరియు చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు దీనగాథ పరిస్థితి గా ఉన్నది..
విషయానికి వస్తే:-
రాష్ట్రంలో ఉద్యాన పంటల్లో అత్యధికంగా మామిడి సాగు అవుతుంది, ఆ మామిడిలో ఎక్కువగా పల్ప్ ఆదరిత మామిడి రకం తోతా పూరి ఎక్కువగా సాగులో ఉంది.. ఇది కేవలం పల్ప్ ఎగుమతుల పైన ఎక్కువ శాతం ఆధారపడి ఉంది గత రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ అనుస్థితిల కారణంగా ఎగుమతులు తగ్గిపోవడంతో దేశీయంగానే పరిశ్రమల దగ్గర అధిక మొత్తం నిల్వలు ఉండటంతో, పరిశ్రమలు కొనకుండా నిలిపివేయడంతో, గత సంవత్సరం ప్రభుత్వం ముందస్తుగానే చర్యలు తీసుకొని ప్రారంభం నుంచే ఫ్యాక్టరీ ఎనిమిది రూపాయలు.. ప్రభుత్వం నాలుగు రూపాయలు.. ఇచ్చే విధంగా మాట్లాడి ఇప్పించడం జరిగింది. కానీ ఈ సంవత్సరం మామిడి కోతలు మొదలై రెండున్నర నెల పూర్తవస్తున్న దాదాపు 90 శాతం మామిడి కోతలు ముగిసిన తరువాత ప్రభుత్వం ఇప్పుడు కళ్ళు తెరిచి నాలుగు రూపాయల అదనపు సహాయాన్ని అందిస్తామని చెబుతున్నారు... కానీ ఇది వరకే మామిడి కాయలు కోసి పరిశ్రమలకు మార్కెట్ కి అమ్మినటువంటి రైతులు ఆశ్చర్యానికి గురి కావడం.. ఒక ఇంత బాధకు కూడా గురయ్యారు. గత నెల రోజులుగా నాలుగు రూపాయలు ఐదు రూపాయలు ధరతో అంటి మామిడి ( తోతాపూరి) అమ్మేసినటువంటి రైతులు ప్రభుత్వ తీరుని తప్పుపడుతున్నారు... దీని అంతటికి కారణం రాష్ట్రంలో ఉద్యానవన శాఖకి సరైన ప్రాధాన్యత లేకపోవడం 680 మండలాలకు గాను కేవలం 200 మంది ఉద్యాన అధికారులు ఉండడం.. గ్రామస్థాయిలో ఉద్యాన శాఖ సహాయకులు 2000 మంది ఉన్నప్పటికీ , వీరికి ఉద్యానవన శాఖ పనుల కంటే వ్యవసాయ శాఖకు సంబంధించిన పనులే వారి దగ్గర అత్యధికంగా చేపిస్తూ ఉండటంతో. ఉద్యానవన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో క్షేత్రస్థాయి నుంచి పై వరకు వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవడంతో.. రాష్ట్రంలోని ఉద్యానవన రైతులు గత రెండు సంవత్సరాలుగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక సరైన సలహాలు సూచనలు ఇచ్చే వాళ్ళు లేక, ఆత్మహత్యలే శరణ్యం దిశగా వెళ్లడం కూడా జరుగుతున్నది అంటూ రైతులు చెప్పుకొస్తున్నారు.. అంతేగాక క్షేత్రస్థాయిలో రైతులు ఆవేదన చెందుతున్నారు.. గ్రామస్థాయిలో ఉన్నటువంటి ఉద్యానవన సహాయకులు ఎరువుల అమ్మడం, విత్తనాల అమ్మడం, పంట నమోదు మరియు సచివాలయ సర్వేలు బిఎల్ఓ డ్యూటీలు తో సతమతం అవుతుండడంతో.. రైతులకి ఎటువంటి సహాయం చేయలేని స్థితిలో ఉద్యానవన శాఖ ప్రస్తుతం కాలం వెలదీస్తుంది..!! ఉద్యానవన సహాయకుల దగ్గర బలవంతంగా వ్యవసాయ శాఖ పనులు చేపిస్తుండడంతో ఉద్యానవన శాఖ పూర్తిగా మరుగున పడిపోయింది.. రాబోవు రోజుల్లో నిర్వీర్యం అయిపోయే పరిస్థితి కూడా దాపరి0చే రోజులు ఉన్నాయని విశ్లేషకులు చెప్పుకొస్తున్నారు .. ఉద్యానవన రైతులు బాగుపడాలంటే ఉద్యానవన శాఖకి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఉద్యానవన రైతులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ గిట్టుబాటు ధర కల్పించడంలో ఉద్యానవన శాఖ నిమగ్నమైతే తప్ప.. ఈ సమస్యకి శాశ్వత పరిష్కారం లభించదని రైతులు వాపోతున్నారు. గత రెండు సంవత్సరాలుగా అరటి మామిడి బొప్పాయి ఇలా వరుసగా ఉద్యానవన పంటలు.. గిట్టుబాటు దరకలేక, ఇబ్బంది పడడానికి కారణం సరైన యంత్రాంగం లేకపోవడమే... అంటూ ఆదర్శ రైతులు చెప్పుకొస్తున్నారు..ఉద్యానవన సహాయకుల చేత వ్యవసాయ శాఖకు సంబంధించిన ఎరువులు అందించడం.. గత ఆరు సంవత్సరాలుగా ఉద్యానవన సహాయకులను కట్టు బానిసలు లాగా వ్యవసాయ శాఖ వారి శాఖ అవసరాల కోసం వినియోగించుకుంటూ ఉద్యానవన శాఖ సహాయకుల్ని పూర్తిగా ఉద్యానవన రైతులకు దూరం చేశారు దీని పరిణామమే రాష్ట్రంలో ఉద్యానవన రైతుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలకి ప్రధాన కారణం.. తిరుపతి జిల్లా కలెక్టర్, మరియు ఆర్డీవో ఉద్యాన శాఖ ఏడి వారు చొరవ తీసుకొని మా రైతులకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు..

# నీట్ పరీక్ష..

## ప్రయాణం వాయిదా వేసుకున్న ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి
మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత ఎయిర్‌పోర్ట్ నుంచి తన నివాసానికి బయలుదేరినట్లు చెప్పారు.
నీట్ రీటెస్టును ఎన్‌టీఏ కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. 22 లక్షల మందికిపైగా విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా 5,440, విదేశాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఏఐ ఆధారిత నిఘా సహకారంతో 1.38 లక్షల సీసీటీవీ కెమెరాల ద్వారా 95 వేలకుపైగా పరీక్షా గదులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎలక్ట్రానిక్ పద్ధతిలో జరిగే మోసాలను అరికట్టేందుకు 51 వేలకుపైగా సిగ్నల్ జామర్లను ఏర్పాటు చేశారు.

# ఇంటింటికీ యోగా..సంపూర్ణ ఆరోగ్యం

**ప్రధానికి ధన్యవాదాలు**



యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధాని మోదీ ప్రపంచానికి భారతదేశ శక్తిని చాటుతూ దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్నారని కొనియాడారు. ప్రధాని చొరవతో 190 దేశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రపంచానికి భారత్ విశ్వగురు అని, ప్రపంచానికి మార్గనిర్దేశం చేయగలిగేది భారతదేశమేనని స్పష్టం చేశారు. ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ పెంచేది యోగానేనని, యోగాను ప్రజలకు దగ్గర చేసిన రామ్ దేవ్ బాబా కృషి అమోఘమని కొనియాడారు.

**శాశ్వత మందిరాలు**

సాంకేతికత, ఆధ్యాత్మికత కాంబినేషన్ తో వెళ్తేనే భవిష్యత్ ఉంటుందని, హెల్తీ, వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. యోగాంధ్ర-2025లో విశాఖలో నిర్వహించి రికార్డులు సృష్టించామని, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ రికార్డులు సాధించామని గుర్తు చేశారు. వచ్చే ఏడాది తిరుపతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం 1.33 లక్షల సెంటర్లల్లో కోటి మందికి పైగా యోగా సాధన చేస్తున్నారని వివరించారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలు నిర్మిస్తామని తెలిపారు.

**ప్రత్యేక పోర్టల్**

యోగా కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రోటోకాల్స్ రూపొందించేందుకు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. యోగాంధ్ర కోసం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేస్తామన్నారు. జంక్ ఫుడ్ వద్దు, ఫాస్ట్ ఫుడ్ ను దూరంగా పెడదామని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, రసాయన రహిత ఆహారాన్ని స్వీకరిస్తే అనారోగ్యం దరి చేరదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని స్పష్టం చేశారు.

**సంజీవని ప్రాజెక్టు**

సంజీవని ప్రాజెక్టును ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని, వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేస్తూ సంజీవనిలో యోగాను చేరుస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. రోజుకో గంట యోగా, ధ్యానం, ప్రాణాయామం చేస్తే ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరమే రాదని చెప్పారు. తాను 30 ఏళ్ల నుంచి యోగా అభ్యాసం చేస్తున్నానని, ప్రతి రోజూ బిజీగా ఉంటూ రకరకాల సమస్యలను ఫేస్ చేసినప్పటికీ యోగాసాధన వల్లే అన్ని ఇబ్బందులను అధిగమించగలుగుతున్నానని వివరించారు. టెక్నాలజీతో పాటు యోగాను, ఆధ్యాత్మికతను అడాప్ట్ చేసుకోవాలని కోరారు.

**ప్రపంచ రికార్డులు**

రాష్ట్రంలో మొత్తం 1.07 కోట్లమంది పౌరులు, 2.5 లక్షల మంది శిక్షకులు యోగాలో పాల్గొన్నందుకు రెండు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కాయని, వాటిని అధికారులు వేదికపై ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, సవిత, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

మొదటి పేజీ తరువాయి
**అమరావతి, జూన్ 21:**



ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వీలుగా రెండేళ్ల పాలనపై 'ప్రోగ్రెస్ రిపోర్ట్ 2024-26' విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులను, అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ పాలనలోని విధ్వంసంపై ఇచ్చిన 7 శ్వేతపత్రాలతో పాటు మరో 3 ముఖ్యమైన అంశాలపై ఈ నివేదికలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**10 అంశాలపై నివేదికలు**

గత ప్రభుత్వంలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది, ఎంతలా పురోగతి సాధించింది అనే విషయాలను ఇందులో పొందుపరచాలని ముఖ్యమంత్రి చెప్పారు. నాటి 7 శ్వేతపత్రాల అంశాలతో సహా ఈసారి కొత్తగా డెవలప్మెంట్, గవర్నెన్స్, వెల్ఫేర్ అంశాలపైనా రిపోర్టులు విడుదల చేయాలని స్పష్టం చేశారు. వీటిలో ఫైనాన్స్, డెవలప్మెంట్, వెల్ఫేర్, గవర్నెన్స్ అనే 4 ప్రధాన అంశాలకు సంబంధించిన ప్రోగ్రెస్ రిపోర్టులను ముఖ్యమంత్రే స్వయంగా విడుదల చేస్తారని తెలిపారు.

**యాక్షన్ ప్లాన్**

మంత్రులు 6 పేపర్లు రిలీజ్ చేసిన తర్వాత మిగిలిన 4 పేపర్లను ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూలై 18 కల్లా మొత్తం అన్ని రిపోర్టులు విడుదల చేసేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ఇవన్నీ విడుదల చేసిన తర్వాత పుస్తక రూపంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో భాగంగా ముందుగా సోమవారం విద్యుత్ రంగంపై తొలి నివేదికను విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

**సమీక్షలో పాల్గొన్న ప్రముఖులు**

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ సాయి ప్రసాద్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సినిమా కథనాన్ని తలదన్నే విధంగా నరసాపురంలో మర్డర్

- భయాందోళనలో పట్టణ ప్రజలు
- ఘటనకు ట్రయాంగిల్ లవ్ స్టోరీ కారణమా?

**నరసాపురం జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**

వివాహేతర సంబంధం నేపథ్యంగా ఓ మహిళ దారుణ హత్యకు గురికాగా, ఆమెతో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన జాలం టీనా రోజా (30)కు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె ఏఎన్ఎం శిక్షణ పొందుతూ శ్రీహరికోట ప్రాంతానికి వెళ్తూ వస్తుండేది. కాగా, ఆమెకు గతంలో సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన ప్లంబింగ్ వర్కర్ మార్గాని రమేష్‌తో పరిచయం ఉంది. అయితే ప్రస్తుతం వారి మధ్య సంబంధాలు లేవని తెలుస్తోంది. ఇదే సమయంలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన అంగర సురేష్ బాబు సఖినేటిపల్లిలో రొయ్యల చెరువుల వ్యాపారం చేస్తూ మృతురాలి ఇంటి సమీపంలో నివసిస్తున్నాడు. అతనితో కూడా టీనా రోజా ఫోన్ ద్వారా



మాట్లాడుతుండేది.

### రైల్వే స్టేషన్ నుంచి వస్తుండగా ఘాతుకం:

శనివారం రాత్రి టీనా రోజా తాను హుబ్లీ-నరసాపురం రైలులో వస్తున్నట్లు సురేష్ బాబుకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో సురేష్ బాబు ఆదివారం ఉదయం తన షిఫ్ట్ డిజైర్ కారు (ఏపీ 39 ఖూ 1222)లో నరసాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఉదయం 7 గంటలకు రైలు దిగిన టీనా రోజా అతని కారు ఎక్కింది. ఇద్దరూ ప్రయాణిస్తుండగా, సఖినేటిపల్లి లంకకు చెందిన మార్గాని రమేష్(పాత ప్రియుడు )కారును అడ్డుకుని, తాను కూడా వస్తానని చెప్పడంతో టీనా రోజా అనుమతించింది.

ముగ్గురూ కలిసి కారులో నరసాపురం పట్టణం పాలకొల్లు టు నరసాపురం రోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గల ఒక టీ కొట్టు వద్ద ఆగారు. ఉదయం 7:30 గంటల సమయంలో కారు ఆగిన వెంటనే మార్గాని రమేష్ తన వెంట తెచ్చుకున్న పదునైన కత్తితో టీనా రోజాపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమె ఎడమ భుజం, ఛాతీ, పొట్ట భాగంలో బలంగా పొడిచాడు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అంగర సురేష్ బాబుపై కూడా రమేష్ కత్తితో దాడి చేయడంతో అతని ఎడమ చేతి మణికట్టు, ఛాతీపై తీవ్ర గాయాలయ్యాయి.

### ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి:

దాడి అనంతరం నిందితుడు రమేష్ సంఘటన స్థలం నుండి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో పడివున్న టీనా రోజాను సురేష్ బాబు అదే కారులో స్థానిక చైతన్య ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు టీనా రోజా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన సురేష్ బాబు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

### రంగంలోకి దిగిన పోలీసులు:

సమాచారం అందుకున్న నరసాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలంలో మృతురాలి సెల్‌ఫోన్, హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సురేష్ బాబు సెల్‌ఫోన్‌ను ఎస్ఐ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడు మార్గాని రమేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భీమారంలో ఘనంగా కట్ట మైసమ్మ తల్లి కొలుపు,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 21, 2026:**

భీమారం మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ వద్ద గత సంవత్సరం గుడి నిర్మించి ప్రతిష్టించిన కట్ట మైసమ్మ తల్లి దేవాలయం వద్ద కట్ట మైసమ్మ తల్లి కొలుపు కార్యక్రమాన్ని కట్ట నాగరాజు-కోమలి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు, మైసమ్మ తల్లి కి శనివారం రోజున సాయంత్రం నుండి ఆదివారం వరకు పంబాల కళాకారులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి, బోనాలు



చెల్లించి, కోళ్లు మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , పెనుకుల మల్లేష్, పెనుకుల భీమేష్, అన్నపురం కృష్ణమూర్తి గౌడ్, మాటేటి సమ్మయ్య, బైరినేని మహేష్, భూక్య రమేష్, భీమారం సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి -పున్నం చంద్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోడేటి రవి, సీనియర్ నాయకులు దర్శనాల రమేష్, గుండు తిరుపతి, వేల్పుల శ్రీనివాస్, చిలకాని రాజమణి, మద్దికల్ సర్పంచ్ పోతం సమ్మన్న, భూక్య గోపి, జర్పుల దస్రు నాయక్ పాల్గొన్నారు

# గుండ్ల సింగారంలో గుడిసెల కూల్చివేతపై దళిత హక్కుల పోరాట సమితి ఆగ్రహం

- జీవించే హక్కును కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: నిమ్మల మనోహర్
- 360 గుడిసెల కూల్చివేత అమానుషం: దళిత హక్కుల పోరాట సమితి
- నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి
- పేదల ఆశ్రయాలను కూల్చివేయడం దుర్మార్గం



**ఎల్కతుర్తి జూన్ 21(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి నిమ్మల మనోహర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇండ్ల స్థలాలు, సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న కడు నిరుపేద ప్రజలు గుండ్ల సింగారంలో దాదాపు 360 గుడిసెలను ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని తెలిపారు.జూన్ 20 తెల్లవారుజామున ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా జేసీబీలతో దాదాపు అన్ని గుడిసెలను నేలమట్టం చేయడం అమానుష చర్య అని ఆయన మండిపడ్డారు. గుడిసెల్లో నివసించిన వారిలో ఎక్కువ మంది ఇండ్ల స్థలం, ఇల్లు లేని నిరుపేదలేనని పేర్కొన్నారు.ప్రభుత్వాలు నిరాశ్రయులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించి, పేదలు ఆశ్రయం కోసం వేసుకున్న గుడిసెలను రాత్రికి రాత్రే కూల్చివేయడం దుర్మార్గమని నిమ్మల మనోహర్ విమర్శించారు.గుడిసెలను కూల్చివేసిన అదే స్థలంలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యన్నం కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు - వృద్ధులకు అన్నదానం

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి జూన్ 20.**

కాంగ్రెస్ పార్టీ నాయకులు మధిర మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ శ్రీ యన్నం కోటేశ్వరరావు గారి పుట్టినరోజు సందర్భంగా మధిర 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు దోర్నాల సాయికుమార్ ఆధ్వర్యంలో ఆదరణ సేవ ఫౌండేషన్ లో వృద్ధులకు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 1వ వార్డు కౌన్సిలర్ దోర్నాల శిరీష



వెంకటరవి గారు మరియు యన్నం కోటేశ్వరావు గారి కుమారుడు డాక్టర్ కార్తీక్ గారు హాజరై కేక్ కట్ చేసి అన్న వితరణ చేశారు.ఈ సందర్భంగా యన్నం కోటేశ్వరరావు గారు దేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని అందరూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దోర్నాల మణిబాబు, కుటుంబరావు, జాన్ బాబు, కృష్ణారావు, నరేష్, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ద్వారకాతిరుమలలో ఘనంగా ముగిసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు.





**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలు మరియు దేవాదాయ శాఖ కమీషనర్ మార్గదర్శకాల మేరకు, ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 'అంతర్జాతీయ యోగా దినోత్సవ' వేడుకలు అత్యంత వైభవంగా ముగిశాయి. శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి.ఈ నెల 7వ తేదీన ఆలయ ప్రాంగణంలోని 'పద్మాలయ కళ్యాణ మండపము'లో ప్రారంభమైన యోగా శిక్షణా తరగతులు రెండు వారాల పాటు నిరంతరాయంగా కొనసాగి నేటితో విజయవంతంగా ముగిశాయి. ఈ శిక్షణలో స్థానికులతో పాటు పలువురు భక్తులు యోగాసనాలలో మెళకువలను నేర్చుకున్నారు.ఈ వేడుకల్లో భాగంగా, గత 11వ తేదీన ఆలయ 'అనివెట్టి మండపము'లో ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆ రోజు 10 మంది నిపుణులైన యోగా మాస్టర్స్ పర్యవేక్షణలో సుమారు 650 మంది అభ్యాసకులు యోగాసనాలు వేశారు.

ఆదివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ముగింపు వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఆలయ ఈవో అధికారి వి. త్రినాథ్ రావు ఉదయం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. సుమారు 10.00 గంటల వరకు జరిగిన ఈ భారీ యోగా ప్రదర్శనలో ఆలయ సిబ్బంది, వైఖానస ఆగమ పాఠశాల విద్యార్థులు, సేవాదళ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు భక్తులు వెయ్యి మందికి పైగా పాల్గొని సామూహిక ఆసనాలు వేశారు.ఈ బృహత్తర కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందని, భక్తుల నుంచి విశేష స్పందన లభించిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# మాదిగ బిడ్డను బలి తీసుకున్న సిఐను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.

- -అంబేద్కర్ విగ్రహానికి వినతి ఇచ్చి నిరసన.
- -తమ దళిత బిడ్డకు న్యాయం చేయాలని ఆర్,డి,ఓ,కు వినతి.
- -క్రాంతికి న్యాయం చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం..
- -ఎపి,యం,ఆర్,పి,యస్,

**కుందుర్పి జూన్ 21, జన సముద్రం నూస్;**

క్రాంతి మాదిగ బిడ్డను బలి తీసుకున్న సిఐను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా ఆయనను శిక్షించాలని ఎపి,యం,ఆర్,పి,యస్, నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యం,ఆర్,పి,యస్, ఉద్యమ నాయకుడు పేరుపోగు, వెంకటేశ్వర్రావు వారి కుమారుడు, పేరుపోగు క్రాంతి కుమార్ సెల్ఫీ వీడియో లో ఆత్మహత్య చేసుకున్న విషయం గురించి సువర్ణ రాజు ఆదేశానుసారం, శనివారం ఎపి,యు,ఆర్,పి,యస్, అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గపట్టణంలో డాక్టర్ బి,ఆర్, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.అనంతరం కళ్యాణదుర్గం ఆర్,డి,ఓ,అధికారి వారికి మా మాదిగ బిడ్డను బలితీసుకున్న సిఐ,నాగరాజును వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వినతి పత్రంఇచ్చి ,ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాని పక్షంలో యం,ఆర్,పి,యస్, ఆధ్వర్యంలో ఉద్యమంను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



ముందుగా జైబీమ్, ఎపి,యం,ఆర్,పి,యస్, నాయకత్వం వర్ధిల్లాలి, దాసరి,సువరణ రాజు, నాయకత్వం వర్ధిల్లాలిని అంటూ నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, గూబనపల్లి నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మీనుగ ఓబులేష్,జిల్లా గౌరవఅధ్యక్షులు, సాకే, చంద్ర,జిల్లా కన్వీనర్, దొణతిమ్మప్ప, సీనియర్ నాయకులు ,యర్ర కుళ్లాయప్ప, రామకృష్ణ,దాసంపల్లి రవి,తాలూకా గౌరవ అధ్యక్షులు, రవీంద్రప్ప, అధ్యక్షులు ,డాబా, రమేష్, అధికార ప్రతినిధి ,కే హనుమంతు రాయుడు, కోశాధికారి, దుర్గప్ప. బ్రహ్మసముద్రం మండల గౌరవ అధ్యక్షులు, శివలింగప్ప, అధ్యక్షులు మల్లికార్జున, శెట్టూరు గౌరవాధ్యక్షులు తదితరలు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్న నిత్యాన్నదాన పథకానికి విరాళాలు.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరూ భక్తులు ఆదివారం రూ. 2,01,116 /- కి దిప్పకాయల పాడుకి చెందిన పరిమి వెంకట గిరి రూ. 1,01,116/- మరొక దంపతులు మార్టేరుకి చెందిన బోడపాటి సోమేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ. 1,00,000/-విరాళాన్ని చెక్కు ద్వారా ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం సూపర్నెంట్ కే వి దుర్గ ప్రసాద్ ,ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు దాతలను ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.



# కొలువుదీరిన కుల్లాయి స్వామి పీర్లు

**జన సముద్రం న్యూస్ నార్పల జూన్ 21**

జిల్లాలోని ప్రసిద్ధి చెందిన గూగూడు కుల్లాయి స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చావడిలో పీర్లు కొలువు తీరాయి. తెల్లవారుజామునే ప్రధానార్చకులు హుస్సేనప్ప తిరుమల కొండన్న వంశీయులు కుల్లాయి స్వామి ప్రధాన పేరుతో పాటు మొత్తం 21 పీర్లను పట్టు వస్త్రాలు పూలతో సుందరంగా అలంకరించి కొలువు తీర్చారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలలతో పాటు పురుగు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గూగుడుకు తరలివచ్చారు తమ ఇష్ట దైవానికి పూలు కొబ్బరికాయలు చక్కెర సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు చక్కెరను బస్తాలతో స్వామివారికి సమర్పించారు. మరికొందరు ట్రాక్టర్లలో కలప దుంగలను తీసుకొచ్చి ఆలయం ముందున్న అగ్నిగుండంలో వేశారు. గుగుడు కుల్లాయి స్వామి ఆలయ సమీపంలోనే మతసామరస్యానికి



ప్రతీకగా వెలసిన ఆంజనేయ స్వామిని భక్తులు ముందుగా దర్శించుకోవడం విశేషం సోమవారం కుల్లాయి స్వామి ఆలయంలో నిత్య పూజ నివేదన కార్యక్రమం తో పాటు సంప్రదాయబద్ధంగా 5వ సరిగెత్తు నిర్వహిస్తారు.

# స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి, జిల్లా నాయకులు ఆలం వెంకట నర్స నాయుడు

**జనసముద్రం న్యూస్ నార్పల జూన్ 21**

ఆంధ్రప్రదేశ్ను పరిశుభ్రంగా మార్చాలనే లక్ష్యంతో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనలో ప్రతి ఒక్కరూ భాగం కావాలి.ఇందులో భాగంగా ప్రతి కుటుంబం తప్పనిసరిగా చెత్తను నాలుగు రకాలుగా వేరు చేయాలి వీటిలో తడి చెత్త, ఆహార విశేషాలు,కూరగాయలు పండ్ల తొక్కలు, పొడి చెత్త ,ప్లాస్టిక్ ,కాగితం ,గాజు ,లోహ, వస్తువులు సానిటరీ చెత్త డైపర్లు శానిటరీ నాప్కిన్లు, మాస్కులు ప్రత్యేక వ్యర్థాలు బ్యాటరీలు, బల్బులు పెయింట్ డబ్బాలు గడువు ముగిసిన మందులు ఇలా చెత్తను వేరు చేయడం వల్ల పర్యావరణం పరిరక్షించిన వాళ్ళమవుతాం వ్యర్థాల దుర్వినియోగం పెరుగుతుంది డంపింగ్ యార్డ్ లపై భారం తగ్గుతుంది మన గ్రామాలు పట్టణాలు మరింత



పరిశుభ్రంగా మారుతాయి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండల మాజీ అధ్యక్షులు సాగునీటి సంఘం అధ్యక్షులు సొసైటీ అధ్యక్షులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జులు కమిటీ అధ్యక్షులు మండలంలోని సీనియర్ నాయకులు ఎంపీడీవో, ఎమ్మార్వో ,పంచాయతీ కార్యదర్శి ,అధికారులు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

# దశదిన కార్యక్రమంలో పాల్గొన్న పంగులూరి అంజయ్య

**జనసముద్రంన్యూస్, కారంపూడి, జూన్ 21;**



పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం కారంపూడి పట్టణంలోని శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ దగ్గరలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కందుకూరి నరసయ్య దశదిన కర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య పాల్గొని నరసయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి పిల్లల చదువులకి పార్టీ అన్ని విధాల సహకరిస్తుందని, వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని చెప్పటం జరిగింది.

## మొగల్తూరులో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**•వంటి లో ఉన్న జబ్బులను తరిమికొట్టాలంటే యోగా చేయండి**

**•యోగ ప్రతీ ఒక్కరికి రోజువారీ పనిలో భాగం కావాలి**

**•ఎంపీడీవో త్రిశులపాణీ పిలుపు**

మొగల్తూరు జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనంజయ్

మొగల్తూరు హైస్కూల్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హైస్కూల్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొని యోగా ఆసనాలు నిర్వహించారు. ఎంపీడీవో



త్రిశులపాణీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పూర్తి ఏర్పాట్లు పంచాయతీ సిబ్బంది చేశారు. ఈ కార్యక్రమంలో యోగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎంపీడీవో త్రిశూలపాణీ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఊబకాయం ప్రధాన సమస్యగా మారిందని శరీరానికి కావాల్సిన ఫిజికల్ అండ్ మెంటల్ ఎక్సర్సైజ్ దొరకకపోవడం వల్ల ఈ సమస్య తీవ్ర రూపం దాల్చిందని ప్రతి ఒక్కరూ యోగ జీవితంలో ఒక భాగంగా ప్రతిరోజు అలవర్చుకోవడం వల్ల శరీరక దృఢత్వం మరియు వివిధ రకాల జబ్బులను తరిమికొట్టే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. అధికారులు సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే యోగా అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక మంచి సాధనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గుబ్బల నాగరాజు, మెండు రాజేష్, బోనం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మనసుకు ప్రశాంతతే యోగ లక్ష్యం

**•స్థానిక విజయనగర న్యాయ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం**

జన సముద్రం న్యూస్ అనంతపురం అర్బన్ జూన్ 21

విజయనగర న్యాయ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక యోగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

మనసుకు ప్రశాంతతే యోగ లక్ష్యం-కళాశాల చైర్మన్ రామిరెడ్డిలి

కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ ప్రారంభించి మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, మానసిక సమస్యలకు యోగ మంచి పరిష్కారమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొద్దిసేపు యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా పొందవచ్చన్నారు.




విద్యార్థులు చిన్న వయసు నుంచే యోగ అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా యోగా నిపుణులు విద్యార్థులకు వివిధ ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులు, ధ్యాన విధానాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా సూర్య నమస్కారాలు, తాడాసనం, వజ్రాసనం, భుజంగాసనం, పద్మాసనం వంటి ఆసనాలను సమిష్టిగా అభ్యసించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.

యోగ ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, చదువులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని అధ్యాపకులు తెలిపారు. అలాగే మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వినియోగం వల్ల కలిగే మానసిక అలసటను తగ్గించడంలో ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ, యోగ సాధన చేయడం వల్ల తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, ప్రశాంత భావన కలుగుతోందని తెలిపారు. యోగ మన భారతీయ సంస్కృతికి గొప్ప వారసత్వమని, ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆదరణ పెరుగుతుండటం గర్వకారణమన్నారు.

చివరగా కళాశాల నిర్వహణ సభ్యులు యోగను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరూ ఆరోగ్యకర జీవనం కోసం ప్రతిరోజూ యోగ చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## 360 రోజులు ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం

**•రాష్ట్ర అధ్యక్షులు చొప్ప వెంకటేశ్వర్లు.**

నెల్లూరు, జూన్ 21, జనసముద్రం జిల్లా ప్రతినిధి.

అయ్యప్ప స్వామి ఆశీస్సులతో 2008లో కేరళ రాష్ట్రంలోని పట్టణం తిట్ట ప్రజా సేవ ట్రస్టుగా స్థాపించబడి 18 రాష్ట్రాల్లో ఎస్ ఏ ఎస్ ఎస్ దిగ్గజంగా నడుస్తుందని, ఐ ఎస్ అయ్యప్ప స్వామి మాలల దేశంలోనే కాక 360 రోజులు ప్రజల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అయ్యప్ప సేవా



సమాజం రాష్ట్ర అధ్యక్షులు చొప్ప వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల వెంకయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. సమాజంలోసేవాభావాన్ని పెంపొందిస్తూ అయ్యప్ప స్వామి బోధించిన ధర్మం, క్రమశిక్షణ, సమానత్వం, సోదర భావాన్ని ఆయన సూచించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమపై ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమస్త అభివృద్ధికి, భక్తుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని కానీ ఈ సందర్భంగా హితవు పలికారు కార్యక్రమంలో. అయ్యప్ప భక్తులు, గురుస్వాములు, సేవా సమాజం సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు, అధ్యక్షులుగాబట్ట మల్లికార్జున్, గౌరవ అధ్యక్షులు ఎం శేఖర్ బాబు, ఉపాధ్యక్షులు సురేష్ రెడ్డి చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పేట విజయ్ శేఖర్, ఆలూరు రాంబాబు, కార్యదర్శులు రామోజీరావు, శివ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య తదితరులు నూతనంగా

## చిన్న వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు.

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తులు 1.దొనాడి. రమేష్, 2.నినాల .జయ సూర్య,3. సుబ్బారెడ్డి సత్తి వీరు ఆదివారం ఆలయానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, పండితులు



తూర్పు వైపు గాలిగోపురం వద్ద ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలుకుగా ప్రదక్షిణలు చేసి స్వామివారి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను ,శేష వస్త్రాన్ని సమర్పించారు. ఈవో వి త్రినాధరావు స్వామివారి జ్ఞాపికను అందించారు. వీరితోపాటు ఆలయ అధికారులు, ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపర్నెంట్ , అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల టౌన్ లో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమం

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 21;

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలోని మున్సిపాలిటీ ఆవరణలో యోగాంధ్ర-2026 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది. ఈ యోగా ఈ కార్యక్రమంలో మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తోపాటు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు యాదవ్, టిడిపి సీనియర్



నాయకులు యెనుముల కేశవరెడ్డి, మద్దిగపు చిన్న వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ మాజీ



చైర్మన్ పోలూరి నరసింహారావు, మద్దినేటి శాంతి, మంజుల అంజి పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారంపూడి లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**•యోగా చేయండి, ఆరోగ్యంగా ఉండండి**

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, కారంపూడి, జూన్ 21;

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి పట్టణంలోని స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు యోగ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యోగవాసనాలతో అందరినీ ఆకర్షించారు, అనంతరం పలువురు మాట్లాడుతూ, యోగ అనేది కేవలం వ్యాయామం కాదు... అది శరీరం, మనసు, ఆత్మను ఒకే తాటిపై నడిపించే జీవన విధానం. ప్రతిరోజూ కొన్ని నిమిషాలు యోగ సాధన చేస్తే శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక




ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతాయి. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మనమందరం ఆరోగ్యకరమైన జీవితానికి తొలి అడుగు వేద్దాం."యోగ చేయండి... ఆరోగ్యంగా ఉండండి. యోగ అలవాటు చేసుకోండి... ఆనందంగా జీవించండి." అంటూ నినాదాలతో స్థానిక చెక్పోస్ట్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజానీకంతో పాటు నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు

**•అధిక ఫీజులు, యూనిఫాం ఫీజు, పుస్తకాల ఫీజుల వసూళ్లపై నిఘా**

**•నరసాపురం విద్యాశాఖ అధికారి పుష్పరాజ్యం**

నరసాపురం జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్

నరసాపురం పరిధి లో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఒత్తిడికి గురిచేస్తే..అధిక ఫీజులు, యూనిఫాం ఫీజులు, పుస్తకాల ఫీజులు వసూళ్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం విద్యాశాఖ అధికారి పుష్పరాజ్యం హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను అన్ని ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపే విధంగా ఫీజులు వసూలు చేయడం, నిర్దిష్ట దుకాణాల నుంచే యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని బలవంతపెట్టడం వంటి చర్యలను సహించబోమన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే విచారణ చేపట్టి సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని పుష్పరాజ్యం సూచించారు. అధిక ఫీజుల వసూళ్లు లేదా ఇతర అక్రమాలపై తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

## సాగర్ ప్రాజెక్ట్ కాలనీ ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం: ప్రాజెక్ట్ ఈ ఈ రమేష్

జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూన్ 21

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లో అంతర్భాగమైన విజయపురిసౌత్ కాలనీ ని సమగ్రంగా అభివృద్ధి చేసి రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని సాగర్ ప్రాజెక్ట్ ఈఈ రమేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విజయపురిసౌత్ కాలనీ లో గతం లో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరిస్తున్నాం అన్నారు.దశాబ్దాల కాలంగా నెలకొన్న తాగునీరు,విద్యుత్ సమస్యల వల్ల అనేక సార్లు ఇబ్బందులకు గురి అయిన వెంటనే మా జేఈ డి ఈ లు విజయపురి సౌత్ లో నివసిస్తున్న నాయకుల సహకారం తో అనేక సమస్యలను త్వరితగతంగా వెనువెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతున్నది శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే విజయపురిసౌత్ కాలనీ లో 70 ఏళ్లుగా అభివృద్ధి కి నోచుకోని మత్యకారుల కాలనీ రహదారులతో పాటు గ్రామంలో రహదారులను రూ.5 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు.త్వరలో మరో రూ.6 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం,తాగునీరు,విద్యుత్ సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. పి.ఆర్ డిపార్ట్మెంట్ ద్వారా కూడా 2 కోట్లతో సిమెంట్ రోడ్లను నిర్మాణం చేయడం జరిగింది

జల జీవన్ మిషన్ ద్వారా ఆర్ డబ్ల్యూ ఎస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రూ.1200 కోట్లతో నాగార్జున సాగర్ జలాశయం మేకలగొంది వద్ద నుంచి వాటర్ గ్రిడ్ పనులు



శరవేగంగాజరుగుతున్నాయన్నారు.నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కాలనీ తో పాటు పల్నాడు జిల్లా లోని ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీటిని అందించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం అన్నారు.

టూరిజం డిపార్ట్మెంట్ వారు కూడా 20 కోట్లతో బుద్ధవనం ప్రాజెక్ట్ శరవేగంగా జరుగుతున్నాయి

త్వరలోనే టూరిజం అభివృద్ధిలో భాగంగా ఎయిర్ పోర్ట్ విస్తరణ పనులు కూడా జరుతున్నాయి

అభివృద్ధిలో భాగంగా అన్ని డిపార్ట్మెంట్ లకు మా డిపార్ట్మెంట్ నుంచి కావలసిన సహాయసహకారాలు వెనువెంటనే అందిస్తూ అభివృద్ధికి ఆటంకం లేకుండా ముందుకు సాగుతున్నాము అని తెలియజేశారు

## యోగాతో నూరేళ్ళ ఆయుష్షు..! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



జనసముద్రంన్యూస్, మాచర్ల, జూన్ 21;

సనాతన భారతీయ సంస్కృతిలో మహనీయులు ఆచరించిన యోగాతో నూరేళ్ళ ఆయుష్షును పొందవచ్చునని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మాచర్ల పట్టణం లోని మున్సిపాలిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర 2026 కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులు,ఉద్యోగులు స్వచ్ఛంద సేవకులతో కలిసి యోగా చేశారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. గత ఏడాది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నీస్ రికార్డును సాధించిందని గుర్తు చేశారు. యోగాను ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్యమే కాకుండా మంచి ఆలోచనలతో సమాజాన్ని తీర్చవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు యాదవ్, సీనియర్ నాయకులు మద్దిగపు చిన్న వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్ కుమార్,శాంతి, వీరాస్వామి,మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## యర్రబాలెం ఎంపీపీ పాఠశాల లో జరిగిన యోగా కార్యక్రమం

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, జూన్ 21;

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలంలోని ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శైలజ మేడమ్ స్కూల్ విద్యార్థులచే యోగా చేయించటం జరిగింది. ఈ యోగా కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శైలజ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉద్దీపకం బేస్‌లైన్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి : ఏసీఎంఓ కె.రమేష్

(ఐటిడిఎ పీఎంఆర్సీ భద్రాచలం విద్యవిభాగం): విద్యా సంవత్సరం 2026--27లో ఏపీఎస్/ఏజీపీఎస్/జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న 3వ, 4వ, 5వ తరగతి విద్యార్థులకు జూలై 10వ తేదీలోపు ఉద్దీపకం బేస్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నారు.

ఈ పరీక్షలో గత రెండు సంవత్సరాల్లో బోధించిన ఉద్దీపకం--1, ఉద్దీపకం--2 పాఠ్యాంశాల ఆధారంగా విద్యార్థుల చదవడం, రాయడం సామర్థ్యాలను పరిశీలిస్తారు. పరీక్ష నిర్వహణను ఉపాధ్యాయులు కాకుండా ప్రథమ్-- ఏఎస్ఈఆర్ సంస్థ ప్రతినిధులు చేపట్టనున్నారు.



# పాల కేంద్రాల్లో అపరశుభ్రత..

- కల్తీ తంతు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా!
- మాచర్లలో కల్తీ కేంద్రాలపై అధికారుల ఉక్కుపాదం
- బూజు పట్టిన జున్ను, కల్తీ నెయ్యి సీజ్!

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, జూన్ 21;

పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో కల్తీ నిర్వాహకులపై జిల్లా యంత్రాంగం ఆదివారం ఒక్కసారిగా విరుచుకుపడింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖల అధికారులు నేడు భారీ తనిఖీలు చేపట్టారు.

### రంగంలోకి 8 ప్రత్యేక బృందాలు

పట్టణంలో మొత్తం ఎనిమిది బృందాలుగా విడిపోయిన అధికారులు ఏకకాలంలో పాల డెయిరీలు, షాపులపై జల్లెడ పట్టారు. తనిఖీల్లో బయటపడ్డ దృశ్యాలను చూసి అధికారులే షాక్‌కు గురయ్యారు. నిల్వ ఉంచి బూజు పట్టిన జున్ను, రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ డేట్) పచ్చళ్లను అధికారులు భారీగా గుర్తించారు.





### వాసవి మిల్క్ అండ్ స్వీట్స్‌లో ఘోరం

ముఖ్యంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం పక్కన ఉన్న 'వాసవి మిల్క్ అండ్ స్వీట్స్' దుకాణంలో తనిఖీలు చేసినప్పుడు అక్కడి అపరిశుభ్రత, కల్తీ తంతు చూసి అధికారులు నివ్వెరపోయారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న సదరు నిర్వాహకులపై కఠిన చర్యలకుఆదేశించారు.రంగంలోకి అగ్ర అధికారులు.

### ఈ భారీ ఉమ్మడి తనిఖీలకు జిల్లా స్థాయిఉన్నతాధికారులు నేతృత్వం వహించారు:

ఎన్. పూర్ణచంద్రరావు (గుంటూరు, పల్నాడు ఫుడ్ కంట్రోల్ అధికారి)కిరణ్ కుమార్ (మాచర్ల తహశీల్దార్)బి. శ్రీనివాసరావు (జిల్లా పశు వైద్యాధికారి)వీరితో పాటు ఒంగోలు ఫుడ్ కంట్రోల్ అధికారి వేణుగోపాల్, పశువైద్యాధికారి పి. శ్రీనివాసు, మాచర్ల పశువైద్యశాల అధికారి డి.ఎస్.ఎం. మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు నరసింహారావు, వెంకటేశ్వర్లు, ప్రణీత్, సాయి, శివతేజలతో పాటు పల్నాడు జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, సేల్స్ డ్యూటీ భాష, లైవ్ స్టాక్ ఆఫీసర్ శ్రీధర్ బాబు తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.

### వ్యాపారుల్లో వణుకు

అధికారుల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతుండటంతో మరిన్ని అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లా యంత్రాంగం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంతో మాచర్ల పట్టణంలోని ఇతర కల్తీ, నకిలీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## డెడ్ స్టోరేజ్ కి మరో 5.90 అడుగుల దూరంలో సాగర్ జలాశయం

జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి జూన్ 21

నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాశయం నీటిమట్టం మరో 5.90 అడుగులు తగ్గితే ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజ్ లెవల్ 510.00 అడుగులకు చేరుకుంటుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590.00 అడుగులుగా ఉంటుంది. ఇది నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 312.0450 టీఎంసీలకు సమానం. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 515.90 అడుగులు కాగా ఇది 141.9053 టీఎంసీలకు



సమానం. మరో 5.90 అడుగులు నీటిమట్టం తగ్గితే నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం పూర్తిగా డెడ్ స్టోరేజ్ లెవల్ కు వస్తుంది. డెడ్ లెవెల్ స్టోరేజ్ నీటిమట్టం 510.00 అడుగులుగా . ఇది సుమారు 135 టీఎంసీలకు సమానం గా ఉంటుంది. దీంతో ప్రజలు



త్రాగునీటి అవసరాల కొరకు , రైతులు సాగునీరు అవసరం కొరకు చాలావరకు ఈ నాగార్జునసాగర్ ప్రాజెక్టు పైన ఆధారపడి ఉన్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టు కు జలాశయం చేరాలని రైతులు ,ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

## ముటుకూరు ఏఈఎల్ సి ఆధ్వర్యంలో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, దుర్గి మండలం, జూన్ 21;

మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలంలోని ముటుకూరు గ్రామంలో గల ఆంధ్ర ఇవాంజిలికల్ క్రీస్తు లూథరన్ దేవాలయం నందు ఆదివారం ఏ ఈ ఎల్ సి సంఘం ఆధ్వర్యంలో చర్చి డెలిగే మాచర్ల యేసయ్య అధ్యక్షతన పాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్ట్ గుంటూరు సినడ్ పల్నాడు ఫీల్డ్ ఎక్స్ యాక్టింగ్ బిషప్ చర్చి పాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానం మాట్లాడుతూ

ఈ లోకంలో అన్నింటికి మించిన ప్రేమ నాన్న ప్రేమని త్యాగానికి మారుపేరు నాన్న అని ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని తెలియజేస్తూ ఆధ్యాత్మిక సందేశాన్ని అందజేసి అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబం కోసం ప్రతిక్షణం శ్రమిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసే తండ్రి ప్రేమను గుర్తించి వారిని గౌరవించడానికి ప్రపంచవ్యాప్తంగా మూడవ ఆదివారం







ఫాదర్స్ డే వేడుకలను జరుపుకుంటారని, నాన్న అంటే ధైర్యం, బాధ్యత,నమ్మకం, భరోసా అని అలాంటి నాన్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులను గౌరవించుకోవాలని వారి ప్రేమ త్యాగాలు వెలకట్టలేనివని

ఈ భూమి మీద దీర్ఘాయుష్మంతులు కావాలి అంటే బైబిలు వాక్యం నిర్గమ 20-12 ప్రకారం తల్లిదండ్రులను సన్మానించాలని, ఆయన అన్నారు. అందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

చర్చి డెలిగేట్ మాచర్ల యేసయ్య ఆల్టర్నేట్ డెలిగేట్ మాచర్ల జార్జి మాజీ ఎక్స్ డెలిగేట్ మాచర్ల సామేలు, పులిమెల్ల వెంకయ్య మాట్లాడి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఆత్మీయ తండ్రియైన ఫాస్టర్ రెవరెండ్ కటికల యేసుదానంతో కలిసి కేక్ కట్ చేసి ఆయనను శాలవాలతో ఘనంగా సత్కరించారు.

ఫాదర్స్ డే సందర్భంగా చర్చికి వచ్చిన విశ్వాసులకు సంఘస్తులకు స్వీట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్స్ పులిమెల అచ్చయ్య, మాచర్ల ఆనందరావు, కుక్కమూడి య, మాచర్ల లూకయ్య, సంఘ పెద్దలు పులిమేల జక్రయ్య మాచర్ల దేవదానం, మాచర్ల మైఖేల్, మాచర్ల పెద్ద అచ్చయ్య,మాచర్ల పురుషోత్తం పులిమేల ప్రసాద్ కుక్కమూడి ఏసోబు,కుక్కమూడి మరియదాసు స్త్రీల సమాజం తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమలలోని టైల్స్ ఫ్యాక్టరీపై ఎస్సీ కమిషన్ సీరియస్.

### ఫ్యాక్టరీని సీజ్ చేయాలని ఆదేశం.

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 21 ద్వారకాతిరుమల ప్రతినిధి.

ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం శివారులో ఉన్న సిరామిక్స్ టైల్స్ తయారీ ఫ్యాక్టరీ వ్యవహారంపై ఏపీ ఎస్సీ కమిషన్ కన్నెర్రజేసింది. బాధితులకు చెందాల్సిన పెట్టుబడి సొమ్మును తిరిగి ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న యాజమాన్యంపై కమిషన్ సభ్యులు కఠిన చర్యలు చేపట్టారు.విజయవాడకు చెందిన పులిదిం డి పల్లయ్య, నాగజ్యోతి దంపతులు సదరు ఫ్యాక్టరీలో పెట్టుబడి పెట్టారు. అయితే, ఆ పెట్టుబడి సొమ్మును తిరిగి ఇప్పించాల్సిందిగా యాజమాన్యాన్ని పలుమార్లు కోరినా వారు స్పందించలేదు. దీంతో బాధితులు ఏపీ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ పంపిన




నోటీసులను, జరిపిన చర్చలను కూడా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో కమిషన్ సభ్యులు నేరుగా రంగంలోకి దిగారు. ఫ్యాక్టరీకి చేరుకున్న ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ పాతపాటి గౌతం రాజు, మేకల భిక్షం, డాక్టర్ శ్రీపతిబాబు విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఫ్యాక్టరీ డైరెక్టర్లు గైర్హాజరు కావడంతో కమిషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణలో భాగంగా సదరు సంస్థ ప్రభుత్వానికి జీఎస్టీ బకాయిలు చెల్లించకుండా, అక్రమంగా రెండు రకాల టైల్స్ కంపెనీల పేరుతో వ్యాపారం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నందుకు మరియు కమిషన్ ఆదేశాలను ధిక్కరిస్తున్నందుకు ఫ్యాక్టరీని తక్షణమే సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. యాజమాన్యంపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు దాసరి ఆంజనేయులు, తహసీల్దార్ జేవీ సుబ్బారావు, భీమడోలు సీఐ పి.కృష్ణ, ద్వారకాతిరుమల ఎస్సై టీ.సుధీర్, ఎస్సీ సంక్షేమ శాఖాధికారులు, అంబేద్కర్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానుకొండ రాజశేఖర్, మాలసేన జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయమా? వృర్థాల నిలయమా?.

### ద్వారకాతిరుమల జడ్.పి.హెచ్.ఎస్ గేట్ ముందు ఇదే దుస్థితి.

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా జూన్ 21

చదువుల సరస్వతి కొలువుదీరాల్సిన పాఠశాల ఆవరణ.. నేడు వ్యర్థాలకు నిలయంగా మారింది.ద్వారకాతిరుమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేట్ వద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, మద్యం సీసాలు కుప్పలుగా పేరుకుపోయాయి. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పడాల్సిన చోట, ఇలాంటి అపరిశుభ్రమైన వాతావరణం ఉండటం దారుణం. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం ఈ




అసహ్యకరమైన దృశ్యాలను చూస్తూ లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.మద్యం సీసాల ఉనికి విద్యార్థులపై చెడు ప్రభావం చూపుతుందని, విద్యార్థుల రక్షణ, ఆరోగ్యం విషయంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.పరిశుభ్రతను పాటించాల్సిన బాధ్యత కలిగిన పంచాయతీ అధికారులు వెంటనే స్పందించాలి. పాఠశాల గేట్ వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పేరుపాలెం బీచ్‌కు పోటెత్తిన పర్యాటకులు

మొగల్తూరు జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్



పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పేరుపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు సమీప జిల్లాలైన ఏలూరు, కృష్ణా, తూర్పుగోదావరి ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన సందర్శకులు బీచ్ అందాలను ఆస్వాదించారు.

ఉదయం నుంచే బీచ్ ప్రాంతం సందర్శకులతో కిటకిటలాడింది. పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించి, అలల సందడిలో ఉల్లాసంగా గడిపారు. అనంతరం బీచ్ సమీపంలోని దేవాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి బీచ్ పరిసర ప్రాంతాల్లో సంయుక్త భోజనాలు చేస్తూ ఆహ్లాదకరంగా గడిపారు.

వాతావరణం అనుకూలంగా ఉండటంతో చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో బీచ్‌కు చేరుకుని వినోద కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యాటకుల రద్దీతో స్థానిక వ్యాపారులకు మంచి ఆదాయం లభించిందని వ్యాపారులు తెలిపారు. వారాంతం కావడంతో బీచ్ ప్రాంతమంతా సందడిమయంగా మారింది. స్థానిక అధికారులు పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

## శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు

మొగల్తూరు జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్



పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో 216 జాతీయ రహదారి ఆనుకుని వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తూర్పుగోదావరి, కృష్ణా, ఏలూరు తదితర జిల్లాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కొందరు భక్తులు ప్రత్యేక హారతులు, అభిషేకాలు నిర్వహించగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి దర్శనాలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు తాగునీరు, విశ్రాంతి సౌకర్యాలు కల్పించారు. అమ్మవారి కృపతో కుటుంబాలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ భక్తులు ప్రార్థనలు చేశారు. భక్తుల రాకతో ముత్యాలపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## కారుమూరి సునీల్ అరెస్ట్ దారుణం

- అక్రమ అరెస్టులకు భయపడేది లేదు
- వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అఫీషియల్ స్పోక్స్ పర్సన్ బర్రి సమోరు






మొగల్తూరు జూన్ 21 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి బర్రి సామోరు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బర్రె సామోరు మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ నాయకుడు కారుమూరి సునీల్‌ను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడడం దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందని ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కారుమూరి సునీల్ పై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకుని ఆయనను నిర్దోషిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేవు రాంబాబు, మైల నాగరాజు, బొక్క వెంకటేశ్వర్లు, తిరుమణి పెద్దిరాజు, కడలి లక్ష్మీనారాయణ, కొల్లాటి శంకర్, జక్కుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వాయిదాల తర్వాత 'టాక్సిక్' కొత్త రిలీజ్ డేట్..




నటుడు యశ్ కథానాయకుడిగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' (Toxic). ఈ సినిమా విడుదల పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా చిత్రబృందం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ మేరకు యశ్ 'ఎక్స్' వేదికగా కొత్త పోస్టర్‌తో పాటు విడుదల డేట్‌ను వెల్లడించారు. 'హానర్ థై ఫాదర్.. ఋశీఇఅఎ 26-08-2026 నుంచి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో' అని పోస్ట్ చేశారు.

## విజయ్ సేతుపతి కొత్త చిత్రం



కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు విలక్షణ నటుడు విజయ్ సేతుపతి. ఈ ఏడాది 'ట్రైన్', 'స్లమ్ డాగ్' లాంటి చిత్రాలతో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్న ఆయన.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'కాదలిక్క నేరమిల్లై'తో గతేడాది మంచి విజయాన్ని అందుకున్నారు దర్శకురాలు కృతిక ఉదయనిధి. ఇప్పుడామె తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో విజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రాన్ని రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోందట. వచ్చే వారం చిత్రీకరణను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారని, త్వరలో మరిన్ని వివరాల్ని వెల్లడించే అవకాశాలు ఉన్నాయని విజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# తెరపై నాన్న.. ఎవర్‌గ్రీన్



**వెండితెరపై కథలు మారుతుంటాయి.. ట్రెండ్స్ మారుతుంటాయి.. కానీ, గుండెల్ని కదిలించే నాన్న అనే ఎమోషన్‌కి ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ ఎవర్‌గ్రీనే. అందుకే ఆ అందమైన అనుబంధాన్ని ఎప్పటికప్పుడు సరికొత్త కోణంలో ఆవిష్కరిస్తూ సినీప్రియుల్ని అలరించే ప్రయత్నం చేస్తుంటారు మన సినీతారలు. ప్రస్తుతం ఇలా నాన్న పాత్రల్లో వెండితెరపై యాక్షన్ హంగామా చేసేందుకు.. భావోద్వేగాలతో మనసుల్ని బరువెక్కించేందుకు పలువురు అగ్ర హీరోలు సిద్ధమవుతున్నారు. ఈ రోజు ఫాదర్స్ డే సందర్భంగా ఆ చిత్రాల విశేషాలివీ...**

మాస్ అంటే కేవలం గన్స్, గ్యాంగ్‌స్టర్స్, ఫైట్లు మాత్రమే కాదు.. ఓ తండ్రి తన పిల్లల కోసం నిలబడినప్పుడు థియేటర్లో వచ్చే పూనకాలు అంతకంటే పెద్ద మాస్. అందుకే ఇప్పుడీ నాన్న ఎమోషన్‌నే ప్రధాన ఆయుధంలా మలుచుకుని వెండితెరపై మాస్ యాక్షన్‌ని రుచి చూపించేందుకు తెలుగులో పలువురు కథానాయకులు సిద్ధమవుతున్నారు. ఈ సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమాతో విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు చిరంజీవి. ఈ జోష్‌లోనే ఇప్పుడాయన బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత ఈ ఇద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా ఇది. అందుకే ప్రేక్షకుల్లోని అంచనాలకి తగ్గట్లుగా ఈసారి 'వాల్తేరు..'ని మించే భారీ యాక్షన్ కథని సిద్ధం చేసినట్లు చిత్ర వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే నిజానికిది తండ్రీకూతుళ్ల అనుబంధాలతో ముడిపడిన యాక్షన్ కథగా ఉండనుందని సమాచారం. కూతురి కోసం ఎంతకైనా పోరాడే పవర్‌ఫుల్ తండ్రి పాత్రలో చిరు అలరించనున్నట్లు తెలిసింది. దీంట్లో ఆ కూతురి పాత్రనే అనస్వర రాజన్ పోషిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రథమార్ధంలో తెరపైకి వచ్చే అవకాశముంది.

### కూతురి కోసం మరింత నానా



కథానాయకుడు రవితేజ ఈమధ్య కాస్త రూటు మార్చారు. రొటీన్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ల నుంచి పక్కకు వచ్చి కథా ప్రాధాన్యమున్న సినిమాలపై దృష్టి సారించారు. ఈక్రమంలోనే శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఇరుముడి'ని తెరపైకి తీసుకొచ్చారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాన్ని బయటకు వదిలారు. దాన్ని గమనిస్తే ఈసారి సినిమాలో ఎమోషన్‌కు పెద్దపీట వేసినట్లు అర్థమైంది. ముఖ్యంగా తండ్రీ - కూతుర్ల బంధాన్ని బలంగా చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపించింది. కూతురికిచ్చిన మాట కోసం ఓ తండ్రి తనని తాను ఎలా మార్చుకున్నాడు.. ఆమె కోసం ఎలాంటి పోరు చేశాడన్నది ఆసక్తికరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా ఆగస్టు 21న తెరపైకి రానుంది.

### నాన్న కొడుకు ఓ ప్రేమ కథ



ఇటీవలే 'కరుప్పు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు సూర్య. త్వరలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంతో ప్రేక్షకుల్ని మళ్లీ అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'సార్', 'లక్కీ భాస్కర్' విజయాల తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. కుటుంబ భావోద్వేగాలతో నిండిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఇది ముస్తాబైంది. దీంట్లో తండ్రీ-కొడుకుల ఎమోషన్‌కి ఎంతో ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. ఒంటరిగా పసిబిడ్డని పెంచే తండ్రిగా సూర్య కనిపించనున్నట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో స్పష్టత వచ్చింది. మరి అలాంటి వ్యక్తి జీవితంలోకి తన కంటే 20ఏళ్ల చిన్నదైన అమ్మాయి ప్రవేశించడం.. అతనితో ప్రేమలో పడటం.. ఆఖరికి వాళ్ల ప్రయాణం ఎన్ని మలుపులు తిరిగిందన్నది ఆసక్తికరంగా ఉండనుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఆగస్టు 14న విడుదల కానుంది.

## రావిపూడి రక్తంతో విజయ తిలకం దిద్దిన వెంకటేశ్, కల్యాణ్‌రామ్




వెంకటేశ్ , కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో దర్శకుడు అనిల్ రావిపూడి ఓ మూవీని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇక మూవీ ప్రమోషన్స్ చేయడంలో దర్శకుడు అనిల్ రావిపూడి స్టైలే వేరు. తాజాగా సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, (anil ravipudi new movie music director) గేయ రచయిత అనంత్ శ్రీరామ్‌లను ఇసుకలో పాతిపెట్టి మరీ మూవీ ట్యూన్స్ సిద్ధం చేయించిన ఆయన ఇప్పుడు కత్తితో హంగామా చేస్తూ తనదైన శైలిలో కొత్త మూవీకి ప్రచారం కల్పించే ప్రయత్నం చేశారు.'ఎప్పుడూ నేనే ఐడియాలు ఇవ్వాలా' అంటూ కత్తితో అనిల్ రావిపూడి రాగా, (anil ravipudi new movie) కథానాయకుడు వెంకటేశ్ ఆ కత్తి తీసుకుని అనిల్ చేయి కోసి మరీ ఆయనకే వీర తిలకం దిద్దడంతో ఒక్కసారిగా షాకయ్యారు. ఆ తర్వాత వరుసగా కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్ , కృతిశెట్టిలు కూడా ఇదే పని చేయడంతో అనిల్ హడలెత్తిపోయారు 'ఎంత రాయలసీమ బ్యాక్‌డ్రాప్ అయితే మాత్రం మరీ అంత రక్తపాతం అవసరమా.. మనది ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్' అంటూ అనిల్ పలికిన సంభాషణలు నవ్వులు పూయిస్తున్నాయి. 'సీన్ ఓపెన్ చేస్తే రాయలసీమ' అంటూ ప్రచార వీడియోలో కనిపించడం, అనిల్ కూడా రాయలసీమ నేపథ్యంగా అని చెప్పడంతో ఈ మూవీ బ్యాక్‌డ్రాప్‌పై క్లారిటీ వచ్చింది. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా అనిల్ అండ్ టీమ్ పనిచేస్తోంది. షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి ఈ మూవీని నిర్మిస్తున్నారు.




## అంతర్జాతీయ యోగా దినోత్సవంలో తారల సందడి..!



12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో సినీతారలు సందడి చేశారు. బాలీవుడ్, టాలీవుడ్ తారలు తమ సందేశాలను సోషల్ మీడియా వేదికగా పంచుకొన్నారు. ముంబైలో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ , కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయా పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే థీమ్‌తో ఈ కార్యక్రమం జరిగింది.మరోవైపు ఇండియన్ యోగా అసోసియేషన్ అంబాసిడర్, నటుడు విద్యుత్ జమ్వాల్ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో పంచుకొన్నారు. “తల్లిదండ్రులు ఆరోగ్యంపై దృష్టిపెట్టినప్పుడే.. పిల్లలు కూడా ఆరోగ్యంపై శ్రద్ధ పెడతారని పేర్కొన్నారు. హరియాణాలోని గురుగ్రామ్‌లో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ తార శిల్పాశెట్టి పాల్గొన్నారు. మరోవైపు టాలీవుడ్ నటి శ్రీలీలా మీడియాతో మాట్లాడుతూ.. నేటి జీవనంలో ఒత్తిడి ఓ భాగమని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కోవడానికి హెల్తీ లైఫ్‌స్టైల్ అవసరమన్నారు. ఇందుకోసం యోగాని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.




## 'పవన' వేగంతో 'ఓజీ2'.. అప్పుడే మొదలు పెట్టేశారుగా..!

ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ప్రజా కార్యక్రమాల్లో తీరిక లేకుండా పాల్గొంటున్నారు పవన్‌కల్యాణ్. ఇప్పటివరకూ ఆయన ఒప్పుకొన్న సినిమాలన్నీ పూర్తి చేసేశారు. మరి కొత్త సినిమా ఎప్పుడు? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు ఆయన అభిమానులు. మంత్రిగా, జనసేన పార్టీ అధినేతగా పవన్‌కల్యాణ్‌కు ఉన్న బాధ్యతలు, షెడ్యూల్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన నుంచి త్వరగా సినిమా ఆశించడం కల్లే అవుతుంది. కానీ, అందుకు భిన్నంగా ప్రస్తుతం పరిణామాలు చోటు చేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో వచ్చిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. గతేడాది సెప్టెంబరులో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌గా 'ఓజీ2' ఉంటుందని ఇప్పటికే ప్రకటించారు. ఇటీవల పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ కూడా దర్శకుడు సుజీత్ విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత చర్చలు మొదలవుతాయని చెప్పింది. ఇది ఇప్పట్లో అయ్యే పని కాదని, చాలా సమయం పడుతుందని అందరూ అనుకున్నారు. కానీ, పట్టుమని పది రోజులు ముగియక ముందే 'ఓజీ2' చర్చలు షురూ అయ్యాయి ఇదే విషయాన్ని తెలియజేస్తూ సుజీత్, పవన్ కలిసి కథా చర్చల్లో పాల్గొన్న ఫొటోలను చర్చించుకుంటున్న పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పంచుకుంది. ఇదే ఇప్పుడు ఫ్యాన్స్‌తో పాటు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పవన్‌కల్యాణ్ 'ఓజీ2' చేయడానికి ఎంత ఆసక్తిగా ఉన్నారో తాజా పరిణామమే చెబుతోంది. అన్నీ కుదిరితే ఈ ఏడాదిలోనే 'ఓజీ2' పట్టాలెక్కినా ఆశ్చర్యపోనవసరం లేదు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు.

## ఒక్క సినిమాకు రూ.325 కోట్లు..
## రజనీకాంత్‌ను దాటేసిన బాలీవుడ్ స్టార్



ఒకప్పుడు సినిమా హీరోలకు రూ.10కోట్ల పారితోషికం ఇస్తున్నారంటేనే ఆశ్చర్యపోయేవాళ్లం. 90ల్లో రూ.కోటి పారితోషికం తీసుకుని అగ్రనటులు చిరంజీవి, కమల్ హాసన్, శ్రీదేవి రికార్డు సృష్టించారు. గత దశాబ్దకాలంగా దక్షిణాది సినిమాల స్థాయి పెరిగింది. నటులు రజనీకాంత్, యశ్, అల్లు అర్జున్ రూ.200 కోట్లకు పైగా పారితోషికం తీసుకున్నట్టు టాక్. అయితే 2026లో ఈ లెక్కలన్నీ మారిపోయాయి. భారత్‌లో, ఒకే ప్రాజెక్టుతో వాటాల ద్వారా అత్యధిక లాభాలు అందుకున్న నటుడిగా రణ్‌వీర్ సింగ్ రికార్డు సృష్టించారు. అయితే దీన్నే మనం పారితోషికం అని కూడా అనుకోవచ్చు. 'ధురంధర్' సినిమాతో ఆయన ఈ అరుదైన రికార్డు సాధించారు. రెండు భాగాలుగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.3,200 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. ఇండియాలోనే రూ.1,900 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించింది.అయితే ఈ ప్రాజెక్టు కోసం రణ్‌వీర్ ముందుగా ఎలాంటి పారితోషికం తీసుకోలేదు. లాభాల్లో వాటా తీసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. సినిమా నిర్మాణ వ్యయం పెరిగినప్పుడు తన సొంత డబ్బు కూడా పెట్టారు. ఫలితంగా లాభాల్లో రణ్‌వీర్ వాటా భారీగా పెరిగింది. థియేట్రికల్ బోనస్, డిజిటల్, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ నుంచి వచ్చిన ఆదాయంలో రణ్‌వీర్ వాటా రూ.325 కోట్లకు చేరినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. లాభాల్లో ఎక్కువ వాటాను జియో స్టూడియోస్, ఆదిత్య ధర్ బీ62 స్టూడియోస్ సొంతం చేసుకున్నాయి. ఒక్క ప్రాజెక్ట్‌కు భారతీయ నటుడు ఇంత భారీ మొత్తం అందుకోవడం ఇదే తొలిసారి గతంలో ఈ రికార్డు సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై ఉండేది. 'జైలర్' (2024) సినిమాకు ఆయన రూ.250 కోట్లు తీసుకున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ (పుష్ప 2), ప్రభాస్ (కల్కి 2898 ఏడీ), చిత్రాలకు రూ.200 కోట్లకు పైగానే అందుకున్నట్లు తెలుస్తోంది. 2023లో షారుక్ ఖాన్ 'జవాన్', 'పఠాన్' ఒక్కో చిత్రానికి రూ.200 కోట్లు తీసుకున్నట్టు సమాచారం. ఇప్పుడు వీరందరినీ దాటేసి రణ్‌వీర్ సింగ్ దేశంలో అత్యధిక పారితోషికం తీసుకున్న నటుడిగా అగ్రస్థానంలో నిలిచారు.